కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన విమర్శ వ్యాస సంపుటి

# మన నవలలు
# మన కథానికలు



రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

# సద్విమర్శనాపాళి - రాచపాళెం

రాయలసీమ... కరవు కరాళనృత్య నేల, వేటకొడవళ్లతో ఫ్యాక్షన్ భూతాలు సృష్టించే విధ్వంస చరిత్ర మాత్రమే కాదు,  కవులు, రచయితలు, విమర్శకుల కలాలు వెదజల్లిన అమూల్య, ఆధునిక సాహితీ సంపదల గని కూడా. తెలుగు ఆధునిక విమర్శకు నాంది పలికిన, కొత్తపోకడలు నేర్పిన పురిటిగడ్డ అది. కట్టమంచి రామలింగారెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి... ఆ తల్లి అందించిన అనర్ఘ రత్నాలు. వీరు సాహిత్యాన్ని సామాజిక దృక్పథం, శాస్త్రీయ పరిశీలనలతో విశ్లేషించి విమర్శను పదునెక్కించారు. వీరిలో  రాచపాళెంది విశిష్టస్థానం. సంప్రదాయంలో మొలకెత్తిన ఆయన సాహిత్య విమర్శలో క్రమానుగతమైన అభివృద్ధిని సాధించారు. మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడుగా ఎదిగారు. మద్దుకూరి చంద్రం దిద్దిన మార్క్సిస్టు విమర్శనా పద్ధతికి వారసుడిగా రాచపాళెం నిలిచారు. ఏ మాత్రం సమతౌల్యత కోల్పోకుండా విమర్శ రాయగలగడం చంద్రం ప్రత్యేకత. ఆ ఒరవడినే రాచపాళెం అందుకున్నారు. భౌతిక, సాహిత్య పరిస్థితుల మధ్యనున్న వైరుధ్యాలను సక్రమంగా గుర్తించడంలో ఆయన అందెవేసిన చేయి.  కథైనా, నవలైనా, కవిత్వమైనా.. ఆయన విమర్శ సామాజిక చైతన్య సంవిధానంతోనే సాగింది. అన్నింటికీ మించి సద్విమర్శకుడికి ఉండాల్సిన లక్షణం ఆయనలో పుష్కలంగా ఉంది. 'కథానికా శిల్పంలో అత్యంత ప్రధానమైనది రచయిత కంఠస్వరం' అని చెప్పడం ఆయన పరిశీలనా పరిణతికి నిదర్శనం. ఆయన కేవలం విశ్లేషణలకు మాత్రమే పరిమితం కాకుండా, పరిశీలనలు, సూత్రీకరణలు చేస్తూ విమర్శకు కొత్త అర్థం చెప్పారు. ఎంతటి సంక్లిష్ట సామాజిక పరిస్థితులనైనా రచయిత సంపూర్ణంగా అవగాహన చేసుకోగలిగితే దాన్ని సరళంగా, కళాత్మకంగా, స్పష్టంగా చెప్పగలుగుతాడని ఆయన తేల్చిచెబుతారు. అంతేకాదు, ఆయన ఏ దశలోనూ అసహనానికి గురికావడమో, ప్రతికూలభావనకు రావడమో చేయకుండా రచయితపై సానుకూలత, సానుభూతి, సహనంతో విమర్శ చేస్తారు. రచయిత అభిప్రాయంతో వ్యతిరేకించినా అతన్ని పునరాలోచనకు నెట్టేలా విమర్శించడం ఆయనకే చెల్లు.  అందుకే ఆయన 'మన నవలలు- మన కథానికలు' గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు అందుకున్నారు. ఓ పుష్కర కాలంలో వచ్చిన తెలుగు నవలలు, కథానికల మీద విమర్శనా గ్రంథం ఇది. సంఘ సంస్కరణ, జాతీయ, అభ్యుదయ, విప్లవ, దళిత, బహుజన, స్త్రీ, ప్రాంతీయ అస్తిత్వవాదాలను, ఉద్యమాలను ప్రతిబింబించిన నవలలు, కథలపై సమకాలీన వాస్తవికతతో చేసిన సద్విమర్శ ఇది. రాగద్వేషాలకు అతీతంగా వస్తు వివేచనతో సాగే ఆయన విమర్శనా పద్ధతికి నిలువుటద్దం ఈ పుస్తకం. ఆయన విమర్శకుడే కాదు, పరిణతి చెందిన కవి కూడా.

'ఆయుధమే మతమై/మతమే ఆయుధమై

మనసున్న మనుషుల్ని/ బూడిదరాశుల్ని చేస్తుంటే..

మేమెందుకు చావాలన్న ప్రశ్నాయుధంతో

మతోన్మాదులతో యుద్ధంచేయాల్సిందే

మూఢుల క్రీడలకు బంతులు కావడం కన్నా

బతుకు యుద్ధంలో చావడం మిన్న'

అంటూ ఆయన ఎప్పుడో చెప్పిన కవిత మత మౌఢ్య పాశవిక మారణకాండలకు ఓ సమాధానంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా.. సాహిత్య, సామాజిక చైతన్యానికి నిరంతరం కృషిచేస్తున్న ఈ కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత కలం నుంచి వెలువడిన 'మన నవలలు – మన కథానికలు' అత్యంత అసాధారణ పుస్తకం. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 23 జిల్లాల నుంచి 1997-2009 మధ్య ప్రాతినిధ్య నవలలు, కథానికల మీద వచ్చిన సాహిత్య విమర్శ. ఈ పుస్తకం వెనుక ఏకంగా 13 ఏళ్ళ పరిశీలన ఉంది. ఇది విమర్శకుని సమగ్ర దృక్పథానికి నిదర్శనం.

వస్తు–శిల్పాల మీద సృజనాత్మక విమర్శ ఉంది. నవలలు, కథానికలలోని గుణాలేకాకుండా లోపాల్ని కూడా ఎత్తిచూపిన సద్విమర్శ. ప్రసిద్ధ నవల 'ప్రజల మనిషి'లోని శిల్పం మీద రాసిన సృజనాత్మక వ్యాసం ఒక నవలను శిల్పపరంగా ఎలా పరామర్శించవచ్చో తెలిపింది. 'మాలపల్లి'పై రాసిన వ్యాసం దళితోద్యమ పూర్వ సాహిత్య పరామర్శకు ఒక నమూనా. 'సామాజిక ఉద్యమాలు' – 'తెలుగు కథానిక వికాసం', 'అయ్యో పాపం నుండి ఆగ్రహం దాకా తెలుగు దళిత కథానిక' ఈ వ్యాసాలు వర్తమాన, వర్ధమాన విమర్శకులకు పాఠ్యాంశాలే. ఇవి తెలుగు కథానిక మీద కొత్త దృష్టిని ప్రసరించడంతోపాటు దళిత జీవితం వస్తువుగా వచ్చిన కథానికల్ని చారిత్రక దృక్పథంతో ఎలా అధ్యయనం చేయాలో స్పష్టంచేస్తాయి. కాళీపట్నం రామారావు 'యజ్ఞం' (1966), కొలకలూరి 'ఊరబావి' (1969) మీద రాసిన వ్యాసం రచయితల ప్రాపంచిక దృక్పథం, వాళ్ల సామాజిక నేపథ్యం.. రచనలలో ఎలా ప్రతిబింబిస్తున్నదో రుజువు చేస్తోంది.

**ముత్యాల ప్రసాద్**

ఎడిటర్

విశాలాంధ్ర దినపత్రిక

# ఈ పుస్తకం గురించి...

సాహిత్య విమర్శా రంగంలో నా కృషి అటు ప్రాచీన సాహిత్యం మీదా, ఇటు ఆధునిక కవిత్వం, కథానిక, తెలుగు సాహిత్య విమర్శల మీద జరిగింది. నవల మీద నా కృషి చాలా పరిమితమని ఈ గ్రంథమే రుజువు చేస్తున్నది. తెలుగు నవలల మీద నేను రాసిన ఈ పదమూడు వ్యాసాలే నేనింకా చెయ్యవలసిన కృషిని గురించి హెచ్చరిస్తున్నాయి. వీటిలో కొన్నింటిని అఫ్సర్ రాయించగా, తక్కినవి  ఇతర సందర్భాల కోసం రాసినవి. 'జగడం' నవలకు ముందు మాట రాయమని బోయ జంగయ్య గారు నన్ను కోరడం నాకు పరమానందమైంది. ఏ ప్రక్రియ మీద విమర్శ రాసినా వస్తు చర్చ మనకు బాగా ఇష్టమైంది, అలవాటైంది. నందిని సిధారెడ్డి 'ప్రజల మనిషి' నవలా శిల్పం మీద వ్యాసం రాయమని కోరినప్పుడు ఆనందంగా ప్రయత్నించాను. నవలా శిల్ప శాస్త్రాన్ని ముందు బెట్టుకొని కాక, నవలలో శిల్ప విశేషాలుగా నాకు కనిపించిన వాటిని చెప్పడానికి ప్రయత్నించాను.

'కథాంశం' తర్వాత 2006-2008 మధ్య మూడేళ్ళలో కథానికల మీద నేను రాసిన వ్యాసాలు పది. వీటిలో కొన్ని ముందు మాటలు. అయినా విమర్శనాత్మకంగా రాయడానికే ప్రయత్నించాను.

ఈ పుస్తకాన్ని ప్రచురించిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారికి ధన్యవాదాలు.

**రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**

# ఇదీ వరస

## మన నవలలు


| | | |
|---|---|---|
| 1) | నిచ్చెనమెట్ల సమాజానికి నిలువెత్తు రూపం 'గద్దలాడతండాయి' | 01 |
| 2) | భూసంస్కరణల బూటక చిత్రం 'అద్దంలో చందమామ' | 05 |
| 3) | పల్లెను సంస్కరించిన 'పల్లె పిలిచింది' | 09 |
| 4) | 'చీకటి రాజ్యం'పై టార్చిలైటు | 14 |
| 5) | 'వేర్లు' నేర్పిన చదువు, 'బోధి' అందించిన జ్ఞానం | 19 |
| 6) | 'మాలపల్లి' నవలా వైశిష్ట్యం | 25 |
| 7) | కులాన్నే వర్గంగా ప్రతిపాదిస్తున్న 'పెన్నేటి మలుపులు' | 31 |
| 8) | దళిత స్త్రీ చైతన్య సింగం 'ఆకాశంలో సగం' | 36 |
| 9) | అంబేద్కర్ అడుగుజాడల్లో 'జగడం' | 45 |
| 10) | చేను మేస్తున్న కంచెకు నిలువుటద్దం 'చీకటి పూలు' | 50 |
| 11) | యుద్ధం మీద ఫిర్యాదై తేలిపోయిన 'రక్తకాసారం' | 53 |
| 12) | 'ప్రజల మనిషి' నవలా శిల్పం | 60 |
| 13) | చదువుకున్న స్త్రీల బాధల చిత్రం 'ఉమెన్స్ కాలేజ్' | 66 |


## మన కథానికలు


| | | |
|---|---|---|
| 14) | గుండె చప్పుళ్ళు 'ఇసక కథలు' | 73 |
| 15) | కథానికా దండోరా 'ఎదురుచూపులు' | 77 |
| 16) | మారుతున్న ఊళ్ళ కథలు 'ఒక రాత్రి – రెండు స్వప్నాలు' | 81 |
| 17) | తెలుగు కథా వీధిలో 'యజ్ఞం', 'ఊరబావి' | 85 |
| 18) | ఉద్యమానికి ఊపునిస్తున్న 'ఉపాధ్యాయ కథలు' | 89 |
| 19) | వినిర్మల సమాజ స్వప్నంలో 'గాజుకళ్ళు' | 95 |
| 20) | సహజకథకుడు వి.ఆర్. రాసాని | 100 |
| 21) | 'పొగబండి నేస్తం'కు అభినందనలు | 110 |
| 22) | అభివృద్ధిలో వెలుగు నీడల్ని ప్రశ్నిస్తున్న 'చేదుఫలం' | 112 |
| 23) | సామాజిక ఉద్యమాలు – తెలుగు కథానికా వికాసం | 118 |
| 24) | 'అయ్యో పాపం' నుండి 'ఆగ్రహం' దాకా తెలుగు దళిత కథానిక | 142 |

# మన నవలలు

## నిచ్చెనమెట్ల సమాజానికి నిలువెత్తు రూపం

# ‘గద్దలాడతండాయి’

‘**మా**కొద్దీ తెల్లదొరతనం’ అని స్వాతంత్ర్యోద్యమ కాలంలో గరిమెళ్ళ సత్యనారాయణ పాడాడు. ‘మాకొద్దీ నల్లదొరతనం’ అని కుసుమ ధర్మన్న ఆ రోజుల్లోనే పాడాడు. బ్రిటీష్‌పాలనకు ముందు, బ్రిటీష్‌పాలన కాలంలో, బ్రిటీష్ వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత త్రికాలాలలో భారతీయ సమాజాన్ని పాలించిందీ, పాలిస్తున్నదీ దొరలే. వలస పాలన వల్ల భారతీయ సామాజిక వ్యవస్థలో కొన్ని మార్పులు వచ్చిన మాట వాస్తవమే గానీ, సమూలమైన మార్పులు రాలేదు. భారతీయ సమాజ నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించే కులాన్ని వలసపాలన కదిలించలేదు. అది నిర్మూలింపబడితే తప్ప దేనినీ సాధించలేమని డా॥అంబేద్కర్ వాదించారు. భారతీయ సమాజంలో వర్గాలకు వర్ణాలకు (కులాలకు) అవినాభావ సంబంధముంది. కొన్ని కులాలు సంపన్న పీడక వర్గంగా, మరికొన్ని కులాలు పేద పీడిత వర్గంగా రూపొందాయి. సమాజంలో సంభవించే ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాల్లో ఈ అగ్రకుల సంపన్న వర్గమే నిరంతరం ఆధిపత్యం వహిస్తున్నది. పార్టీలు ఎన్నికలు ప్రజాస్వామ్యం వంటివన్నీ ఈ ఆధిపత్యకులం ముందు దాసోహ మంటున్నాయి. అనంతపురం జిల్లాలోని ఒక మారుమూల గ్రామం ఆధారంగా ఈ వాస్తవాన్ని నిరూపిస్తూ స్వామి రచించిన నవల ‘గద్దలాడతండాయి.’ తెలుగు ప్రజా జీవితంలో కొన్ని కులాలు పాలక సంపన్నవర్గంగా ఏర్పడి తక్కిన కులాలను పాలిత పేదవర్గంగా మార్చి పెత్తనం చెలాయించే తీరును ఈ నవల సజీవంగా చిత్రించింది. పాలక కులాలకు రాజ్యస్వభావ ముంది. అవి అన్ని సామాజిక రంగాల మీద ఆధిపత్యం కలిగి ఉంటాయి. ఆ కులాలను నడిపించేది ఫ్యూడల్ బ్రాహ్మణీయ భావజాలమే. అయితే భారతీయ సామాజిక వ్యవస్థలో మరో ముఖ్యాంశం కూడా ఉంది. ఒక కులం తన పై కులం చేత పీడింపబడుతూ తన కింది కులాన్ని పీడించడానికి ప్రయత్నిస్తుంది. ఈ రకంగా కులం పెద్దదైనా చిన్నదైనా దానికి ఫ్యూడల్ బ్రాహ్మణీయ భావజాలమే ఆదర్శంగా ఉంటుంది. ఇది నిచ్చెనమెట్ల సమాజ లక్షణం. ఈ సత్యాన్ని నిరూపిస్తున్నది ‘గద్దలాడతండాయి’ నవల.

మల్లంపల్లి మజరాకు మునసబు ఈశ్వరరెడ్డి. ఈయనకు కోర్టులు పోలీసులతో సన్నిహిత సంబంధాలుంటాయి. ఇతని కన్నా ధనవంతులున్నా ఆధిపత్యం మాత్రం ఇతనిదే.

ఈయనకు సమితి ప్రెసిడెంటు వీరారెడ్డి అండ ఉంటుంది. అలాగే ఆ ఊళ్లోని రెడ్లందరూ ఇతనికి మద్దతిస్తూ ఉంటారు. వీళ్ళందరూ కాంగ్రెస్ పార్టీలో ఉంటారు. భారతీయ వ్యాపార వర్గానికి సంప్రదాయ ప్రతినిధి అయిన సుబ్బయ్య శెట్టి ఈశ్వరరెడ్డి వైపు ఉంటాడు. నాగేంద్రప్ప బోయ కులస్తుడు. తెలుగుదేశం పార్టీలో ఉంటాడు. వడ్డె లింగప్పకు బోయ నాగేంద్రప్పకు మధ్య ఎద్దుల కుమ్ములాటతో స్పర్థ ఏర్పడుతుంది. అది ఈశ్వరరెడ్డి చేతిలోకి పోతేగాని పరిష్కారం కాలేదు. నాగేంద్రప్పకు వెంకటేశులు, భీమన్న అని ఇద్దరు తమ్ముళ్ళు. వాళ్ళు ముగ్గురూ వేర్లు పోతారు. కరువు వల్ల వ్యవసాయం జరగదు. భీమప్ప నకిలీ విత్తనాలిచ్చిన వ్యాపారిని కొట్టి అరెస్టవుతాడు. అతన్ని విడిపించుకోడానికి నాగేంద్రప్ప ఈశ్వరరెడ్డిని ఆశ్రయించవలసి వచ్చింది. దీంతో నాగేంద్రప్ప ఈశ్వరరెడ్డికి తలవంచడం మొదలౌతుంది. వెంకటేశులు వ్యవసాయంలో దివాళా తీసి, భార్యను సందేహించి ఆత్మహత్య చేసుకుంటాడు. ఈశ్వరరెడ్డి ఈ సంఘటనను కేసు చేసి, నాగేంద్రప్ప కాళ్ళమీద పడడంతో కేసు మాఫీ చేయిస్తాడు. దీంతో నాగేంద్రప్ప ఈశ్వరరెడ్డికి పూర్తిగా లొంగిపోయి "నువ్వు కాకపోతే ఇంకెవరు దిక్కు మాకు రెడ్డీ" అంటాడు. వెంకటేశులు చనిపోయాక అతని భార్య రాములమ్మను శంకరరెడ్డి లోబరచుకుంటాడు. నాగేంద్రప్ప వ్యాపారం చెయ్యబోయి భూమిని ఆ శంకర రెడ్డికే అమ్మేస్తాడు. ఇలా బోయ నాగేంద్రప్ప అతని తమ్ములు రెడ్డి వర్గాన్ని ఎదిరించబోయి చేతగాక ఆ వర్గానికి దాసోహమంటారు. దీంతో ఒక నిచ్చెనమెట్టు ప్రదర్శితమైంది. మల్లేశు ఒక దళితుడు. సారా కోసం శంకరరెడ్డి ఇంట్లో దొంగతనం చెయ్యబోయి పట్టుబడతాడు. అతన్ని చావగొట్టి ఊళ్ళో అందరి చేత కాళ్ళు పట్టిస్తారు. మల్లేశు చేత కాళ్ళు పట్టించుకోడానికి ఊరు ఊరంతా ఉవ్విళ్ళూరుతుంది. బోయలు, ఈడిగలు, కురవలు, వాళ్ళలో పేదవాళ్ళు ధనికులు అందరూ వస్తారు. రెడ్డివర్గంతో బాధింపబడిన భీమప్ప కూడా మల్లేశు చేత కాళ్ళు పట్టించుకుంటాడు. గుండుగొరిగి ఊరేగించి మల్లంపల్లికి తీసుకుపోయి ఈశ్వరరెడ్డి కాళ్ళు పట్టిస్తారు. అప్పుడు మల్లేశు కోసం పోలీసులు వస్తారు. ఈశ్వరరెడ్డి వాళ్ళను వెనక్కి పంపిస్తాడు. ఇలా దళితవర్గం కూడా దాసోహమంది. ఇది నిచ్చెనమెట్ల వ్యవస్థ. ఈ వ్యవస్థను గద్దలాడే వ్యవస్థగా రచయిత ఉత్ప్రేక్షించాడు. ఎక్కడికక్కడ ప్రతి కులమూ ఒక గద్దగా మారి కింది కులాన్ని పీక్కుతినే తీరును రచయిత ఎంతో పరిశీలించి చిత్రించాడు. ఈ ప్రధానసూత్రం ఆధారంగా భారతీయ సమాజంలోని మానవ సంబంధాలను, కాల పరిణామంలో అవి పొందే మార్పును రచయిత ఎంతో వివేకవంతంగా గ్రంథస్తం చేశాడు. ఈ సమాజంలో కులాల ముందు వర్గాల ముందు రాజకీయ పార్టీలు నామమాత్రాలని ఈశ్వరరెడ్డి తెలుగుదేశంలోకి దూకితే నాగేంద్రప్ప కాంగ్రెస్‌లోకి దూకిన సంఘటనతో నిరూపించాడు. ఇంకా అనేక

సంఘటనల్ని సందర్భాలను రచయిత నిర్మొహమాటంగా, నిర్భయంగా చెప్పగలిగాడు. రచయిత ధైర్యాన్ని నవలలో అనేకచోట్ల ప్రదర్శించాడు.

కథాకాల స్థలాలను సంఘటనలు, సంభాషణలు, మాండలిక భాష ద్వారా ప్రదర్శించి నవలకు నిర్దిష్టతా లక్షణాన్ని చేకూర్చగలిగాడు. ఎన్.టి.రామారావు అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళ నాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక ప్రకంపనాలకు ఈ నవల ప్రతిఫలనం. దాదాపు మూడు దశాబ్దాలుగా నిరుత్సాహానికి లోనౌతున్న తెలుగు నవలా ప్రియులకు ఈనవల ఎంతో నచ్చుతుంది. తెలుగు నవల భవిష్యత్తుకు ఈ నవల ఒక ఆశాకిరణం.

అయితే ఒక సామాన్య సాహిత్య సూత్రమేమిటంటే, రచయిత ఉన్న సామాజిక పరిస్థితిని చిత్రించడమే గాక, దానిని మార్చడానికి తనదైన ఆలోచనల్ని బయటపెట్టడం. ఉన్న పరిస్థితులు ఎటూ తెలుస్తూనే ఉంటాయి. వాటిని చిత్రించటంతోపాటు, వాటి మీద రచయిత తన నిర్ణయాలను ప్రకటించడం, ప్రత్యామ్నాయ సమాజాన్ని సూచించడం అన్నది ఏ రచయితకైనా కనీస బాధ్యత. స్వామి అలాంటి సూచనేదీ చెయ్యలేదు. దీని వల్ల రచయిత తన బాధ్యతను పూర్తిగా నిర్వహించనట్లు భావించాలి. వాస్తవికతను సాధించే ప్రయత్నంలో రచయిత కొన్ని చోట్ల అతిగా స్పందించినట్లు నవల నిరూపిస్తుంది. నిమ్నకులాలకు బడుగు వర్గాలకు ప్రభుత్వం కల్పించే సదుపాయాల పట్ల సంపన్న కుల వర్గాలకు వ్యతిరేకత ఉన్నమాట నిజమే. అయినా 1984, 85 ప్రాంతాల్లో ఈ నవలలో మాట్లాడుకున్నంత పచ్చిగా మాట్లాడుతారా అనే సందేహం వస్తుంది. అలాగే ప్రభుత్వాధికారులు దళితుల ముఖాన్నే వాళ్ళనన్న మాటలు కూడా ఈ కథాకాలానికి తగినట్లున్నాయా? అని సందేహం వస్తుంది. ఈ సందర్భాలు చదివినప్పుడు గద్దలు సహజంగా ఆడవలసిన దానికన్నా రచయిత ఎక్కువగా ఆడించాడేమో అనిపిస్తుంది. నవలలో రచయిత ఎన్ని కల్పనలైనా చెయ్యొచ్చు. కాని ఆ కల్పనలు తప్పకుండా ఏదో ఒక ప్రయోజనాన్ని సాధిస్తేనే నవల శిల్పవంతం అవుతుంది. ఒక పాత్ర ఒక తీరుగా ప్రవర్తిస్తే, ఆ ప్రవర్తనను ఆ పాత్ర సమర్థించుకోవాలి. అదే సజీవపాత్రచిత్రణ. ఆర్.డి.టి. వాలంటీర్ చలపతి, నాగేంద్రప్ప కూతురు జయమ్మ ప్రేమించుకుంటారు. పెళ్ళి చేసుకోవడానికి మాత్రం కట్నం కావాలంటాడు చలపతి. నాగేంద్రప్ప అందుకు నిరాకరించి జయమ్మను కొడతాడు. ఆ రాత్రి చలపతి, జయమ్మలు అదృశ్యమౌతారు. కట్నంకోసం పట్టుబట్టిన చలపతి ఆ రాత్రి ఆ విషయం మరిచిపోయి, జయమ్మతో ఎలా వెళ్ళిపోయాడు? నవల చివర్లో జయమ్మ శవం పిల్లను ప్రసవించినట్లు చెప్పడం ద్వారా రచయిత ఏమి చెప్పదలచుకున్నాడు? ఆ సంఘటనతో నవలను ముగించాడంటే రచయిత దృష్టిలో దానికి చాలా ప్రాముఖ్యం ఉండి ఉండాలి. కాని దానిని రచయిత సరిగా ఎస్టాబ్లిష్

చెయ్యలేదు. వెంకటేశులు భార్య రాములమ్మ శంకరరెడ్డికి లొంగిపోయినట్లు చెప్పడం, లింగప్ప కోడలు గౌరమ్మ అత్తామామలు మొగుడు బాధపడలేక బళ్ళారిలో డ్రైవర్‌తో లేచిపోయిందని చెప్పడం కథలో ఎంతో అవసరం. కాని వడ్డె లింగప్పకు ఈడిగ రంగమ్మకు మధ్య ఒక గడ్డిమోపు కోసం అక్రమ సంబంధం కల్పించడం ద్వారా రచయిత ఏ నైతిక విలువల్ని ప్రతిపాదించదలచుకున్నాడు? సామాజిక వాస్తవాలను ఎంతో బలంగా చెప్పగలిగిన రచయిత ఆ వాస్తవాలను తాను అర్థం చేసుకొనే తాత్త్విక దృక్పథాన్ని భావజాలాన్ని ఎక్కడా బయట పెట్టకపోవడం ఈ నవలలో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఏ పాత్రలోనైనా రచయిత దాగున్నాడా అని వెదికితే ఏ పాత్రలోనూ కనిపించడు. స్కూలు అయ్యవారులో కొంతవరకు రచయిత కనిపించినా ఆయన ప్రతినిధి పాత్రగా అనిపించడు. రచయిత ఎందుకు ఇంతగా తనను తాను అంతర్ముఖీనం చేసుకున్నాడు? ఈ ప్రశ్నలు సందేహాలు ఉన్నా ఈ నవల ఆసాంతం నిస్సందేహంగా తెలుగు నవలా పునరుజ్జీవన పతాక. ఒక మారుమూల గ్రామ జీవితం ఆధారంగా 'ఒక పెద్ద ప్రజాస్వామిక దేశం'గా పేరొందిన భారతీయ సమాజ జీవిత ప్రతిబింబంగా నిలుస్తున్న ఈ నవల తెలుగు పాఠకుల్ని తప్పకుండా ఆకట్టుకుంటుంది, ఆలోచింపజేస్తుంది.

**వార్త : 02-06-1997**

### భూసంస్కరణల బూటక చిత్రం

# 'అద్దంలో చందమామ'

ప్రసిద్ధ కన్నడ నవలా రచయిత శివరామకారంత్ 'చోముని డప్పు' అనే నవలలో జీవితంలో తనదంటూ కొంత భూమి ఉండాలని దాని కోసం ప్రయత్నించి విఫలమై ప్రాణాలు వదిలిన దళితచోముని తీరును అద్భుతంగా చిత్రించారు. 'అద్దంలో చందమామ' చదువుతుంటే 'చోముని డప్పు' నవలకు కొనసాగింపనే అనుభూతి కలుగుతుంది.

ఆరు 'గ్లాసులు', 'ఏకాకి నౌక చప్పుడు' కథా సంపుటాల ద్వారా, 'అద్దంలో చందమామ', 'పంచమం' నవలల ద్వారా రాయలసీమ నుంచి ఒక మంచి రచయితగా ఎదిగి వచ్చిన రచయిత చిలుకూరి దేవపుత్ర. రెవెన్యూ శాఖలో ఉద్యోగి అయిన దేవపుత్ర రెవిన్యూ వ్యవస్థ చుట్టూ అల్లుకున్న ప్రజా జీవిత వాస్తవాలను తన రచనల్లో ప్రతిబింబించడంలో దిట్ట. మానవతా దృష్టి, ప్రజాస్వామిక ఆలోచన, సామాజిక మార్పు పట్ల నిబద్ధత, సామాజిక న్యాయదృక్పథం కలగలిసిన దేవపుత్ర రచనలు సామాజిక వాస్తవికతను విమర్శనాత్మకంగా ప్రతిఫలిస్తున్నాయి.

స్వాతంత్ర్యానంతరం పేదరికాన్ని నిర్మూలించడానికి భూసంస్కరణలు ఒక మార్గంగా భావించి భూపరిమితి చట్టం తీసికొచ్చింది భారత ప్రభుత్వం.దీనికోసం ఉద్యమాలు నడిచాయి, నడుస్తున్నాయి. అయినా చట్టం ఆచరణలో విఫలమవుతున్నది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచిపోతున్నా భూమిలేని పేదలు దేశంలో ఇంకా ఉన్నారు. అత్యధిక శాతం భూమి కొందరు భూస్వాముల చేతుల్లో నిలిచిపోయింది. పాలకవర్గంలో భూస్వాములు కీలక పాత్రధారులు కావడంవల్ల వాళ్లు చేసే చట్టాలను వాళ్లే ధిక్కరిస్తూ, చట్టాలను తమ చుట్టాలుగా చేసుకుంటూ సమాజ ప్రగతిని నిరోధిస్తుండడం తెలిసిందే. కొన్ని సందర్భాల్లో పేదలకు భూమి పంపిణీ జరుగుతోంది. అది పేరుకు మాత్రమే. పేదలు మాత్రం ఆ భూమిని సాగు చేసుకోలేని పరిస్థితి కనిపిస్తున్నదే. ఈ వాస్తవాన్ని నిరూపించే నవల 'అద్దంలో చందమామ'.

రామాయణంలో చందమామ కావాలని ఏడుస్తున్న రామునికి తల్లి అద్దంలో చందమామను చూపించి నమ్మించినట్లుగా పాలకులు పేదలకు కాగితాల మీద భూమిని చూపిస్తున్న వైనం ఈ నవలలో వస్తువు. రామాయణ కథను ఒక ఇమేజ్‌గా తీసుకొని

నేటి సామాజిక వాస్తవికతను చిత్రించడానికి వాడుకొని ఇంకా కొనసాగుతున్న భూస్వామ్య వ్యవస్థ స్వభావాన్ని బట్టబయలు చేస్తూ భూసంస్కరణలలోని డొల్లతనాన్ని ప్రదర్శిస్తుంది 'అద్దంలో చందమామ' నవల.

1985 ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'తెలుగు మాగాణి సమారాధన' పేరుతో అమలుపరచిన భూమి పంపకాల మీద విమర్శనాత్మక రచన ఈ నవల. ఆ కార్యక్రమంలో ఆర్భాటం ఉన్నంతగా ఆచరణ లేదన్నది రచయిత అవగాహన.

రెడ్డి కరణాల వ్యవస్థ రద్దయినా సమాజం మీద వాళ్ళ ప్రభావం తగ్గలేదు. గ్రామ ప్రజలు ఒకచోట ఉండగా మాజీ కరణం మాధవరావు వచ్చి భూపరిమితి చట్టం భూసంస్కరణల గురించి వివరిస్తాడు. ప్రభుత్వం భూస్వాముల దగ్గరున్న అదనపు భూమిని సేకరించి పేదలకు పంచుతుందని, అందర్నీ అర్జీలు పెట్టుకోమని ప్రోత్సహిస్తాడు. భూపరిమితి చట్టం భూస్వాములకు శాపమైతే దళితులకు వరం అని వాళ్లలో ఆశ పుట్టిస్తాడు. దాదాపు మూడు వందల మంది దళితులు, పేదవాళ్ళు అర్జీలు పెట్టుకుంటారు. ఒక్కో అర్జీదారునికి దాదాపు వెయ్యి రూపాయలు ఖర్చు వస్తుంది. మాధవరావు, బాలయ్యలు వచ్చి ఎవరెవరికో ఇవ్వాలని పేద దళితుల్నించి డబ్బులు వసూలు చేస్తారు. ఎట్టకేలకు ఒక దసరా పండుగనాడు కొత్తపల్లి భూస్వాములైన తిప్పేస్వామి, ధర్మయ్య వంటివాళ్ల అదనపు భూమి పంపక కార్యక్రమం ఏర్పాటైంది. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చి మూడు వందల మందికి పట్టాలు పంచిపోతాడు. భూపరిమితి చట్టం ద్వారా భూమి కోల్పోయిన భూస్వామి తిప్పేస్వామి స్వయంగా ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని నిర్వహిస్తాడు. ఎమ్మెల్యేలను, ఎంపీలను, కలెక్టర్‌ను వేదిక పైకి ఆహ్వానించింది తిప్పేస్వామే. ముఖ్యమంత్రి తన ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని ప్రకటిస్తాడు. భూపరిమితి చట్టానికి లోబడి సహృదయంతో మాగాణినిచ్చిన తిప్పేస్వామిని, ధర్మయ్యలను ప్రభుత్వం తరఫున అభినందిస్తాడు. పట్టాలు పంపిణీ చేసి వెళ్లిపోతాడు. దళితులు పరమానంద పడిపోతారు. మంచిరోజు చూసుకుని పొలం దున్నటానికి పోతారు. భూమి పంపకం కార్యక్రమంలో ముఖ్యపాత్ర పోషించి ప్రభుత్వ అభినందనలు పొందిన తిప్పేస్వామి, ధర్మయ్యలు తమ రౌడీ మూకలతో దళితుల్ని పొలంలోకి దిగకుండా అటకాయిస్తారు. అవమానకరంగా మాట్లాడుతారు. దళితులు వెనుతిరిగిపోయి ఎం.ఆర్.ఓ.కు భూస్వాముల ప్రతిఘటనను టెలిగ్రాం ద్వారా తెలుపుతారు. దళితుల్ని విజయవంతంగా తరిమికొట్టినందుకు భూస్వాములు, కరణం కలిసి విందు చేసుకుంటారు. మర్నాడు దళితులు పోలీసుల అండతో పొలాల్లోకి ప్రవేశించే ప్రయత్నం చేస్తారు. అప్పుడు జరిగిన ఘర్షణలో దళిత నాయకులు హనుమంతు, చిన్నోడు హత్యకు గురవుతారు. దళితులు చెల్లాచెదురై పోతారు.

సామాజిక వ్యవస్థలో మార్పు రాకుండా ఆఫీసు వ్యవస్థలో మార్పులు చేసినంత మాత్రాన ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఈ నవల స్పష్టం చేస్తుంది. దళితుల్ని పొలాల్లోకి

రాకుండా తరిమివేసిన తర్వాత విందు చేసుకుంటూ ధర్మయ్య, తిప్పేస్వామి అన్న మాటలు ఇందుకు నిదర్శనం.

ధర్మయ్య : ఆ కలెక్టరు ఆర్డీవోలు పై నుంచి దిగొచ్చినారా? పెద్ద ఆఫీసర్లయినా గవర్నమెంటు సర్వెంట్సే కదా! అసలు గవర్నమెంటు ఎవరి చేతుల్లో ఉండేది... మనట్లావాళ్ల చేతుల్లో... మనమెవ్వరం?

తిప్పేస్వామి : కింగ్‌మేకర్సుము. రాజుల్ని, రాజ్యాల్ని తయారు చేసేవాల్లము. కాబట్టి కలెక్టర్లు, ఆర్డీవోలు మనకొకలెక్కగాదు.

తరతరాలుగా పల్లెల్లో తిష్ఠ వేసి ప్రజాకంటకంగా మారిన మునసబు, కరణాల వ్యవస్థను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రద్దు చేసింది. తాలూకాలను, సమితులను రద్దు చేసి మండల వ్యవస్థను తీసుకొచ్చింది. అయినా పరిస్థితులలో మార్పు లేదు. లంచగొండితనం బలంగా ఉన్నందువల్ల ఈ మార్పుతో ఫలితం లేదని రచయిత స్పష్టం చేశారు. మాజీ కరణం మాధవరావు, దళిత చిన్నోడి చిన్ననాటి స్నేహితుడు, మండలాఫీసులో ఉద్యోగి అయిన బాలయ్య మండలాఫీసు పరిస్థితిని విషాదంగా వివరిస్తాడు దళితులకు. "మాటలతోకావు. అన్నీ దుడ్లతోనే జరుగుతాయి. బిళ్ళయేసుకుని ఆఫీసు ముందరుండే జవాను మొదలుకుని యమ్మార్వో దాకా అందరూ నోట్లకోసం నోరుతెరిచేవాళ్ళే. ఆడ కరిసే కుక్కలకు కందెనేసినట్లు అందరికీ దుడ్లు బడయ్యాల్ల."

బాలయ్య : "హెడ్ గుమస్తాకీ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌కీ, యమ్మార్వోకి ఇయ్యండి చాలు. అప్పుడేనా... ఇంకా ఎంత ఖర్చు వస్తుందో... ముడుపు చెల్లించుకోకుంటే గుళ్ళో దేవుడు కూడా ఇనడురా మాట... పని తొందరగా చేయించుకోవల్లంటే మార్గం చెప్పి అనెంకా మీ ఇష్టం. ఇట్లే ఏండ్ల తరబడి అర్జీలు ఇచ్చుకుంటూ ఉన్నా మీకు మాత్రం పట్టా కాగితాలు చేతికిరావు చూడు."

బ్రిటీషువారు అంటించి పోయిన ఈ అవినీతి రోగం స్వాతంత్ర్యానంతరం తగ్గకపోగా ఇంకా ముదిరిపోయి పేద దళితుల్ని కూడా వదిలిపెట్టక పీడిస్తుండడాన్ని పై మాటలు రుజువు చేస్తున్నాయి. ఇలాంటి దుర్మార్గపు వ్యవస్థకు దళిత చిన్నోడు వేసిన ప్రశ్న ఇది. "మీ ఆఫీసు వాళ్ళకి గవర్నమెంటోళ్లు జీతాలు ఇస్తావుండారు కదా! మళ్ళీ ఇట్ల బీదోల్ల దగ్గరకూడానా?... గొంచిగాళ్ల భూమిని మాకు పంచిచ్చేకే కదా మీ ఆఫీసు ఆఫీసర్లు ఉండేది. అంతకంటే ఇంకేం పని మీకి... అట్లా పనులుజేసేకి కాదా మీకు జీతాలు ఇచ్చేది. మళ్ళీ నూర్లు నూర్లు దుడ్లు మీకియ్యల్లంటే ఎట్లప్పా?" చిన్నోడి ఈ ప్రశ్నకు రెవిన్యూ వ్యవస్థే సమాధానం చెప్పాలి.

కరణాల వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసినా రెవిన్యూ వ్యవస్థలో కరణాల ప్రభావంకానీ, వాళ్ళ దోపిడీ పాత్రగానీ, నశించలేదనడానికి మాధవరావు పాత్ర నిదర్శనం. అతడు ఒకవైపు దళితులకు సహాయం చేస్తున్నట్లుగా నటిస్తూనే భూస్వాముల కొమ్ముకాస్తాడు.

ఇటీవలి కాలంలో పాలక వర్గాలు మామూలుగా జరగవలసిన పనులకు ఆకర్షణీయమైన పేర్లు పెట్టి ప్రకటనలతో, ఫంక్షన్లతో ఆర్భాటాలు చేసి ప్రజల్లో విపరీతమైన ఆశలు కలిగించి వంచించడాన్ని రచయిత ఈ నవలలో సజీవంగా చిత్రించాడు. మాజీ కరణం మాధవరావు దళితుల్నుంచి డబ్బులు గుంజడానికి "మీరిచ్చే ఈ ఐదు నూర్లు మిమ్మల్ని శాశ్వతంగా మాగాని రైతులుగా మార్చేస్తుంది" అని ఉబ్బిస్తాడు. ఈ మాటలు దళితుల్లో కలిగించిన భ్రమల్ని చిన్నోడు పాత్ర ద్వారా ప్రదర్శించాడు రచయిత.

'అద్దంలో చందమామ'లో రచయిత భూమి పంపకాలను బూటకం చేస్తున్న రాజకీయ ఆర్థిక శక్తుల్ని చిత్రిస్తూనే మరో అద్దంలో చందమామను కూడా ప్రదర్శించాడు. అది సాంఘిక చందమామ. చిన్నోడి భార్య లచ్చుములు చిన్నోడి కష్ట జీవితం చూచి రుచించక అమ్మగారింటికి వెళ్ళిపోతుంది. అక్కడ యెంగటేశులు అనే వాడు ఆమెను ప్రలోభపెట్టి లేవదీసుకొనిపోయి అనంతపురం చేర్చి వేశ్యా వృత్తిలోకి దించుతాడు. ఆమె భ్రమలన్నీ తొలగిపోయి తిరిగి భర్త దగ్గరికి చేరుకుంటుంది. శ్రామిక జీవితం నుంచి ఆమె దూరమై సుఖపడాలనుకోవడం కూడా అద్దంలో చందమామే. భూస్వామ్య అగ్రవర్ణ వ్యవస్థలో పీడనకు, మోసానికి గురయ్యే దళితులలో కనిపించే మానవ సంబంధాలు మాత్రం అద్దంలో చందమామ కాదు. అసలుసిసలైన సహజ చందమామే.

దళిత జీవితాన్ని చిత్రించిన తెలుగు నవలల్లో 'అద్దంలో చందమామ' నిస్సందేహంగా విశిష్టమైనది.

"మిరపగింజజూడ మీద నల్లగ నుండు కొరికి చూడ లోన చురుకు మనును" అని వేమన అన్నట్లు పరిమాణంలో చిన్నదైనా ఈ నవల వస్తుబలం దృష్ట్యా, వాస్తవికత దృష్ట్యా మిన్నగా ఉంది.

వ్యక్తిగతంగా సౌమ్యుడైన రచయిత కథనంలోగానీ, సంభాషణల్లోగానీ, ఎక్కడా తాను జోక్యం చేసుకొని అనవసర వ్యాఖ్యలు చేయడు. పాత్రలతోనూ మాట్లాడించడు. వస్తువును శిల్పంతో మింగించే సాహసం చేయడు.

మనిషి మనుగడకు సమాజ ప్రగతికి మూలమైన భూమి కొందరి సొత్తైనప్పుడు, అది అందరికీ చెందాలంటే ఆ కొందరు చేసే ఆగడాలు, పాలక వర్గం ఆ కొందరి కొమ్ము కాయడం, ప్రచారాలతో, ఆర్భాటాలతో పేదల్ని దగా చేయడం, దళారులు సంపన్నుల ప్రయోజనాలకు ఉపయోగపడడం వంటి వాస్తవాలను సృజనాత్మకంగా విశ్లేషించి ప్రజల్ని భూమి రాజకీయాల్లో జ్ఞానుల్ని చేయడం ఈ నవల సాధించిన సామాజిక ప్రయోజనం. వాస్తవానికి ప్రాముఖ్యమిచ్చి కల్పనను పరిమితం చేసి వాస్తవిక సాహిత్య మర్యాదల్ని కాపాడడం సాహిత్యపరంగా ఈ నవల సాధించిన విజయం.

**ఆంధ్రభూమి : 05-10-1999**

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Mana+Navalalu+Mana+Kathanikalu](http://kinige.com/book/Mana+Navalalu+Mana+Kathanikalu)**

* * *